# ప్రజా మారిటల్
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



తప్పుడు ప్రచారం చేస్తే చెప్పు తెగుద్ది - మంత్రి సీతక్క ఫైర్


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 254 పేజీలు : 04 వెల రూ. 2 ఆదివారం 12 - 04 - 2026


## జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు
# పునరాలోచించుకోవాలి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- బీఆర్ఎస్‌లో చేరాలనే జీవన్ రెడ్డి నిర్ణయాన్ని తప్పుపట్టిన మహేశ్ గౌడ్
- కేసీఆర్ అవినీతిపై పోరాడిన జీవన్ రెడ్డి నిర్ణయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్య
- చిన్నపాటి విభేదాల కారణంగా పార్టీని వీడటం సరైన నిర్ణయం కాదని హితవు
- ఇప్పటికీ ఆయనపై తమకు గౌరవం ఉందన్న మహేశ్ గౌడ్
- కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎల్లప్పుడూ సముచిత గౌరవం ఇచ్చిందని, కీలక బాధ్యతలు అప్పగించిందన్న మహేశ్ గౌడ్



**హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరాలని తీసుకున్న నిర్ణయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ జెండా మోసిన ఆయన, కేవలం స్థానికంగా ఉన్న చిన్నపాటి విభేదాల కారణంగా పార్టీని వీడటం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. దశాబ్దాల పాటు కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై అలుపెరగని పోరాటం చేసిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధపడటం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చర్యలు ఆయన రాజకీయ స్థాయికి తగవని, నవ్వుల పాలు కావద్దని - మిగతా 2 లో

## బీసీ మహిళల ఉప కోటా కోసం
# ఢిల్లీని గడగడలాడిస్తాం


2 లో

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించేంత వరకు విశ్రమించేది లేదన్న కవిత
- మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడం లేదంటూ కేంద్రంపై ఫైర్
- తాను ఢిల్లీకి వెళ్లి వివిధ పార్టీల నేతలను కలుస్తానని వెల్లడి


2 లో

## నేడే తెలంగాణ
# ఇంటర్ రిజల్ట్స్

- వాట్సాప్ లో రిజల్ట్స్ ఎలా పొందాలంటే..!
- ఇంటర్ రిజల్ట్స్ విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ఐటీ శాఖ
- 'మీసేవ వాట్సాప్ చాట్‌బాట్' ద్వారా అందుబాటులో ఫలితాలు

## ఇస్లామాబాద్ వేదికగా
# ఇరాన్-అమెరికా చర్చలు



- జేడీ వాన్స్ కు స్వాగతం పలికిన షరీఫ్
- శాంతి స్థాపన కోసం అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు
- పాక్ ప్రధాని షెహబాజ్‌తో అమెరికా వైస్ ప్రెసిడెంట్ భేటీ
- శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్
- ప్రాంతీయ శాంతి స్థాపనే లక్ష్యంగా ఈ చర్చలు
- భేటీలో పాల్గొన్న జేడీ వాన్స్, జారెడ్ కుష్నర్

**ఢిల్లీ :** పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి స్థాపనే లక్ష్యంగా అమెరికా, ఇరాన్ మధ్య కీలక చర్చలకు అంతా సిద్ధమైంది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ ఈ చర్చలకు వేదికగా నిలిచింది. ఈ చర్చల ప్రారంభం సందర్భంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, పాకిస్థాన్ ప్రధానమంత్రి - మిగతా 2 లో


2 లో

## హర్మూజ్ దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్ జగ్ విక్రమ్

- అమెరికా-ఇరాన్ తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత ఈ మార్గాన్ని దాటిన తొలి భారత నౌక ఇదే
- పశ్చిమాసియా సంక్షోభంతో నిలిచిపోయిన నౌకా రవాణా పునరుద్ధరణకు ఇది సంకేతం
- ముంబైకి చెందిన గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీకి చెందిన ఈ నౌక 20,000 టన్నుల ఎల్పీజీతో ప్రయాణం

## బెంగాల్ ఉత్సాహం
# గుజరాత్‌లోనూ చూడలేదు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- బెంగాల్ సభల్లోని ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదన్న ప్రధాని
- మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు ఖాయమని జోస్యం
- టీఎంసీ 15 ఏళ్ల పాలనలోని అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామన్న మోదీ
- తొలి కేబినెట్ భేటీలోనే ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం



**ఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు. తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

**చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు**

అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు - మిగతా 2 లో




# అమరావతే
# సరైన సమాధానం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- జగన్ పిచ్చి వాగుడుపై చర్చ అనవసరం
- అమరావతే సరైన సమాధానం చెబుతుంది
- రాజధాని ఒక సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్
- 5 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ విలువ భవిష్యత్తులో లక్ష కోట్లు
- హైదరాబాద్ అభివృద్ధి మోడల్‌లోనే అమరావతి నిర్మాణం
- 'ఈ3' కార్యక్రమంలో సీఎం



**అమరావతి :** జగన్ (మావిగన్) చేస్తున్న విమర్శలకు రాజధాని అమరావతి అభివృద్ధే సరైన సమాధానం చెబుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పిచ్చి పట్టినట్లు మాట్లాడే వారికి ప్రజలే పిచ్చోడి ముద్ర వేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అలాంటి వారి పిచ్చి వాగుళ్లపై చర్చ కూడా - మిగతా 2 లో

## టీడీపీ కార్యాలయంలో
# శిక్షణా తరగతులు


2 లో

- క్రమం తప్పకుండా హాజరవుతున్న చంద్రబాబు
- కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతూ అభిప్రాయాల మార్పిడి
- పార్టీ శ్రేణుల ఆర్థిక బలోపేతానికి జీ3 కార్యక్రమం ప్రకటన
- క్లీన్ పాలిటిక్స్‌కు టీడీపీని కేరాఫ్ అడ్రస్‌గా నిలపాలని పిలుపు
- టీడీపీ కుటుంబాన్ని సొంత కుటుంబంలాగే చూసుకుంటానని వెల్లడి

# సంపాదకీయం

## 'కాల్పుల విరమణ'కు తూట్లు!



ప్రపంచమంతా ఎంతో ఆశగా, ఆత్రంగా ఎదురుచూసిన కాల్పుల విరమణ ఒప్పందం ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాకుండానే ముగిసిపోయే ప్రమాదం కనబడుతోంది. తీవ్ర వైషమ్యాలతో కాలుదువ్వుకునే వైరిపక్షాలు యుద్ధ క్షేత్రాన్ని విడిచిపెట్టడం అంత సులభమేమీ కాదు. అందుకే ఒప్పందం కుదిరాక కూడా అక్కడక్కడ పరస్పర దాడులు తప్పవు. కానీ పశ్చిమాసియా పరిస్థితి కాస్త భిన్నమైనది. కాల్పుల విరమణపై తొలుత అమెరికా, ఆ తర్వాత ఇరాన్ ధ్రువీకరించాక, మధ్యవర్తి పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సైతం ప్రకటన చేశారు. ఎప్పుడూ లేనిది ఇజ్రాయెల్ కూడా ఒప్పందాన్ని అంగీక రిస్తున్నట్టు తెలిపింది. కానీ 24 గంటలు గడవకుండానే అందరిదీ తలోమాట అయింది. మధ్యవర్తి పాత్ర పోషించే దేశం దృఢమైన స్వరం వినిపించగలగాలి. అవసరమైతే శాసించగలగాలి. కానీ అమెరికా అప్పులపై ఆధారపడే పాక్ ఆ పని చేయగలదా? ఘర్షణలు నివారించిన ఖ్యాతిని కూడా 'త్యాగం' చేసి, తెరవెనకుండి పాకిస్తాన్ ద్వారా కథ నడిపిస్తున్న చైనా ప్రత్యక్షంగా రంగంలోకి దిగితే అమెరికా, ఇజ్రాయెల్ ఈ మాదిరి డ్రామాలకు సాహసించేవి కాదు.అసలు పశ్చిమాసియాకు సంబంధించి ఏ ఒప్పందం కుదరాలన్నా అమెరికాను సంతృప్తిపరిస్తే సరిపోదు. ఆ దేశం ఒకటి కాదు... రెండు! అవిభాజ్య కవలల మాదిరిగా వ్యవహరిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ రెండూ ఒప్పుకుంటే తప్ప ఏదీ సాధ్యపడదు. ఒక్కోసారి ఆ రెండూ కావాలని భిన్న స్వరాలు వినిపిస్తాయి. దీన్ని వ్యూహం అనాలో, చవకబారు ఎత్తుగడగా భావించాలో ఎవరికీ తెలియదు. అమెరికా అవునంటుంది... కాసేపటికి ఇజ్రాయెల్ కాదంటుంది. పర్యవసానంగా అనుకున్నది అమలుకాక అవతలి పక్షం అయోమయంలో పడుతుంది. అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ పట్టాభిషేకమయ్యాక ఆయన అల్లుడు జేరడ్ కుష్నెర్ ద్వారా ఇజ్రాయెల్‌కు చుట్టరికం కలవడంతో పట్టపగ్గా ల్లేకుండా పోయాయి. అందుకే వైట్‌హౌస్‌లో, ట్రంప్‌కు బాగా దగ్గరగావుండే వ్యక్తుల్లో కలకలం మొదలైంది. ఇప్పుడు తోకే కుక్కను ఆడిస్తోందన్న రీతిలో వ్యవహారం ముదిరింది.కనుకనే ఒప్పందంపై తొలుత ప్రకటించిన ట్రంప్ లెబనాన్‌పై దాడులు సాగుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు ఉండిపోయారు. అటు తర్వాత ఒప్పందంలో లెబనాన్ ప్రస్తావన లేదని బుకాయించటం మొదలుపెట్టారు. ఇరాన్ 10 అంశాల ముసాయిదా కొత్తదేమీ కాదు. దురాక్రమణకు ముందే ఇరాన్ దాన్ని ప్రతిపాదించింది. అప్పట్లో అది ట్రంప్‌కు నచ్చలేదు. ఇక ఇరాన్ ఎంతకూ లొంగకపోవటం, చమురు ధరలు ఆకాశాన్నంటడంతో కొంపమునుగుతుందని అర్థమై అది ఆచరణయోగ్యమేనని అంగీకరించక తప్పలేదు. తన కూటమిలోని ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేయరాదంటున్న ట్రంప్... ఆ దేశానికి మద్దతుగా నిలబడిన లెబనాన్‌లో మాత్రం ఇజ్రాయెల్ ఊచకోత కొనసాగించటం సబబేనంటున్నారు. ఇది మర్కట తర్కం కాదా? కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఉత్సవం చేసుకుంటున్న జనంపై పది నిమిషాలపాటు ఏకధాటిగా సాగించిన కాల్పుల్లో 250 మందికిపైగా మరణించారు. మరో 1,000 మంది గాయపడ్డారు.కాల్పుల విరమణ ప్రకటించాక అంతవరకూ 119 డాలర్లుగావున్న బ్యారెల్ ముడి చమురు ధర 94 డాలర్లకు చేరింది. కానీ ఇజ్రాయెల్ హంతక దాడులతో అదికాస్తా మళ్లీ 97కు పెరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ కపట నాటకాలు కట్టిపెడితే తప్ప ప్రపంచం ప్రశాంతంగా మనుగడ సాగించలేదు. అది జరగాలంటే ఆ రెండు దేశాల్లోని ప్రజలతో పాటు ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి తీసుకురావాలి. ప్రపంచం సంక్షోభం అంచుల్లో ఉంది. ఇరాన్ ఇప్పటికే యుద్ధంవల్ల సమస్తం కోల్పోయింది. 3,000 మంది పౌరులు మరణించగా, లక్షలాది జనావాసాలు శిథిలాలుగా మారాయి. మౌలిక సదుపాయాలన్నీ ధ్వంస మయ్యాయి. ఇరాన్ శక్తిమేరకు ప్రతీకార దాడులు చేస్తూ దురాక్రమణకు దిగిన ఆ రెండు దేశాలతోపాటు, వాటికి సహకరిస్తున్న ఇరుగు పొరుగు దేశాలను సైతం దెబ్బతీయగలిగింది. పశ్చిమాసియాలో ఇంతకుమించి మరేం జరగకూడదకునే దేశాలు ఇక తటస్థ అవతారాలు చాలించి నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్ని లోటుపాట్లున్నా ఈ ఒప్పందం కొనసాగేలా చూడాలి. శుక్రవారం జరిగే చర్చలు ఫలవంతం కావాలి. లేనట్టయితే చరిత్ర క్షమించదు.

## మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు 6 నెలల జైలు శిక్ష !

**మొదటిపేజీ తరువాయి –** వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు విశాఖపట్నం కోర్టు షాక్ ఇచ్చింది. పదేళ్ల కిందటి కేసులో ఆయనకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేయనున్నట్లు అమర్‌నాథ్ తెలిపారు.వివరాల్లోకి వెళితే... విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 2016 ఏప్రిల్‌లో గుడివాడ అమర్‌నాథ్ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నాలుగు రోజుల పాటు దీక్ష కొనసాగించడంతో ఆయన ఆరోగ్యం క్షీణించింది.ఈ క్రమంలో పోలీసులు ఆయనను బలవంతంగా కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అప్పట్లో విశాఖ టూటౌన్ పోలీసులు అమర్‌నాథ్‌పై ఆత్మహత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతోంది.తాజాగా ఈ కేసుపై విచారణ పూర్తి చేసిన విశాఖపట్నం రెండో అదనపు ప్రధాన న్యాయస్థానం న్యాయమూర్తి వరలక్ష్మి, అమర్‌నాథ్‌ను దోషిగా నిర్ధారిస్తూ తీర్పు వెలువరించారు. తమ పోరాటం వల్లే విశాఖకు రైల్వే జోన్ వచ్చిందని, కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అమర్‌నాథ్ పేర్కొన్నారు.

## బెంగాల్ ఉత్సాహం గుజరాత్‌లోనూ చూడలేదు

**మొదటిపేజీ తరువాయి –** పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా చర్చలు

**మొదటిపేజీ తరువాయి –** ముహమ్మద్ షెహబాజ్ షరీఫ్‌తో శనివారం సమావేశమయ్యారు.ఈ భేటీలో వాన్స్‌తో పాటు అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ పాల్గొన్నారు. ప్రధాని షరీఫ్‌కు సహాయకులుగా ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్, అంతర్గత వ్యవహారాల మంత్రి మోహసిన్ రజా నఖ్వీ హాజరయ్యారు. ఇరు దేశాల ప్రతినిధులు నిర్మాణాత్మక ధోరణితో చర్చల్లో పాల్గొనేందుకు ముందుకు రావడం పట్ల పాక్ ప్రధాని ప్రశంసించారు.ఈ చర్చలు ఈ ప్రాంతంలో సుస్థిర శాంతికి ఒక మెట్టుగా నిలుస్తాయని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి పునరుద్ధరణ కోసం ఇరు దేశాలకు తమ సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. అంతర్జాతీయంగా ఉత్కంఠ రేపుతున్న ఈ చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం లభిస్తుందని పలు దేశాలు ఆశిస్తున్నాయి.

## జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు పునరాలోచించుకోవాలి




**మొదటిపేజీ తరువాయి –** సూచించారు.కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎల్లప్పుడూ సముచిత గౌరవం ఇచ్చిందని, కీలక బాధ్యతలు అప్పగించిందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వ్యక్తిగత అసంతృప్తి కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని, ఇన్నేళ్ల రాజకీయ అనుబంధాన్ని తెంచుకోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. పార్టీ వీడినప్పటికీ ఆయనపై తమకు వ్యక్తిగత గౌరవం ఉందని, అయితే ఇప్పటికైనా తన నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ జీవన్ రెడ్డి తన మనసు మార్చుకుని వెనక్కి తగ్గితే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు, పార్టీకి మేలు చేస్తుందని అన్నారు. రాజకీయాల్లో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యమని, ఆయన తప్పుడు దారిలో వెళు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# అమరావతే సరైన సమాధానం

**మొదటిపేజీ తరువాయి –** అనవసరమని ఆయన తేల్చిచెప్పారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన తెలుగుదేశం నాయకుల శిక్షణా తరగతుల్లో సీఎం స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో, పార్టీ శ్రేణులతో ఆయన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

**లక్ష కోట్ల నిధి అమరావతి! :** అమరావతి భవిష్యత్తుపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన విజన్‌ను వివరించారు. రాజధాని అమరావతి అనేది ఒక స్వయం ఆర్థికాభివృద్ధి (సెల్ఫ్ ఫైనాన్స్) ప్రాజెక్టు అని ఆయన స్పష్టం చేశారు. ఇక్కడ ప్రభుత్వానికి ఏకంగా 5 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉందన్నారు. ప్రస్తుత మార్కెట్ రేట్ల ప్రకారం ఎకరం రూ. 10 కోట్లు విలువ వేసుకున్నా, ఆ భూమి మొత్తం విలువ రూ. 50 వేల కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. భవిష్యత్తులో ఎకరం రూ. 20 కోట్లకు చేరితే, ఆ భూమి విలువ ఏకంగా లక్ష కోట్లకు చేరుతుందని వివరించారు. అమరావతి గురించి, ఇటువంటి వాస్తవాలు తెలియని వారు చేసే విమర్శలను అస్సలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

**హైదరాబాద్ మోడల్ :** అభివృద్ధి అనేది ఒకరోజుతో ఆగిపోయేది కాదని, అదొక నిరంతర ప్రక్రియ అని సీఎం తేల్చిచెప్పారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలు నిరంతరం విస్తరిస్తూనే ఉన్నాయని గుర్తుచేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్ పోర్ట్, ఐటీ, నాలెడ్జ్ ఎకానమీ అన్నీ హైదరాబాద్ ఆదాయాన్ని



అమాంతం పెంచాయన్నారు. తెలంగాణ రాష్ట్ర మొత్తం ఆదాయంలో 70 శాతం కేవలం హైదరాబాద్ నుంచే వస్తోందని తెలిపారు. తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే తొలి స్థానంలో ఉందంటే, దానికి కారణం హైదరాబాద్ నగరమేనని స్పష్టం చేశారు. సైబరాబాద్ వల్ల హైదరాబాద్ నేటికీ అభివృద్ధి చెందుతూనే ఉందన్నారు. రాజధాని అమరావతి కూడా అచ్చం ఇదే హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చెందుతుందని సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు.

**కార్యకర్తల కోసం ప్రత్యేకంగా 'ఈ3' కార్యక్రమం :** పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే నేతలు, కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి సీఎం చంద్రబాబు ఒక కీలక ప్రకటన చేశారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా నిలబెట్టేందుకు 'ఈ3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. సొంత కుటుంబం కోసం తాను ఎలా ఆలోచిస్తానో, తన టీడీపీ కుటుంబం కోసం కూడా అదే విధంగా ఆలోచిస్తున్నానని సీఎం భరోసా ఇచ్చారు.

**క్లీన్ పాలిటిక్స్, పాజిటివ్ ఓట్లు :** ఎన్టీఆర్ భవన్‌లో శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో సీఎం చంద్రబాబు కాఫీ తాగుతూ ముచ్చటించారు. వారికి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టామని, క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నామన్నారు. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలంతా పనిచేయాలని పిలుపునిచ్చారు.నాయకులు పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలని సూచించారు. గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రం కోసం ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరుపై నాయకులు, కార్యకర్తల నుంచి ఆయన ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ప్రత్యర్థి పార్టీల దుర్మార్గాలను సామాన్య కార్యకర్త సైతం మెరుగ్గా విశ్లేషించేలా రాజకీయ అవగాహన పెంచుకోవాలని సూచించారు.

# టీడీపీ కార్యాలయంలో శిక్షణా తరగతులు

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన క్రమం తప్పకుండా హాజరవుతూ పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో, పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఆర్థిక స్వావలంబన కోసం 'ఈ3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు.పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరాల్లో చంద్రబాబు చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతూ, వారితో నేరుగా సంభాషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, పరిపాలన అంశాలపై తన సుదీర్ఘ అనుభవాన్ని పంచుకుంటున్నారు. గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరుపై కార్యకర్తల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ స్వీకరిస్తున్నారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్న మనం, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి. గతంలో



కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి," అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. కార్యకర్తల ఆర్థిక బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఈ3 ప్రోగ్రాం తీసుకొస్తాం. నీతి, నిజాయతీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' కార్యక్రమం చేపడతాం" అని హామీ ఇచ్చారు. "నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచించానో, టీడీపీ కుటుంబం కోసం కూడా అదే విధంగా ఆలోచిస్తున్నాను" అని ఆయన పేర్కొనడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రత్యర్థి పార్టీల తీరును సమర్థంగా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

# హర్మూజ్ దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్ జగ్ విక్రమ్

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తాత్కాలికంగా చల్లారడంతో నిలిచిపోయిన నౌకా రవాణా నెమ్మదిగా సాధారణ స్థితికి వస్తోంది. ఇందులో భాగంగా భారత 'జగ్ విక్రమ్' అనే ఎల్పీజీ ట్యాంకర్ కీలకమైన హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఈ మార్గంలో ప్రయాణించిన తొలి భారత నౌక ఇదే కావడం గమనార్హం .షిప్-ట్రాకింగ్ డేటా ప్రకారం... ఈ ట్యాంకర్ ఈరోజు మధ్యాహ్నానికి ఇది ఒమన్ సింధుశాఖలోకి ప్రవేశించి, తూర్పు దిశగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ముంబైకి చెందిన గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యంలోని ఈ నౌక, దాదాపు 20,000 టన్నుల ఎల్పీజీని రవాణా చేస్తున్నట్లు వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి.పశ్చిమాసియా సంక్షోభం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు హర్మూజ్ జలసంధి ప్రాంతంలో దాదాపు 28 భారత నౌకలు చిక్కుకుపోయాయి. మార్చి ఆరంభం నుంచి ఇప్పటివరకు 9 నౌకలు పర్షియన్ గల్ఫ్ నుంచి బయటపడగా, మరో 15 భారత నౌకలు ఇంకా సురక్షిత మార్గం కోసం ఎదురుచూస్తున్నాయి.ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైంది. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. జగ్ విక్రమ్ ప్రయాణం ఇంధన సరఫరాపై ఆందోళనలను కొంత తగ్గించినప్పటికీ, పలు నౌకలు ఇంకా చిక్కుకొని ఉండటంతో పరిస్థితి పూర్తిగా చక్కబడలేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.



# నేడే తెలంగాణ ఇంటర్ రిజల్ట్స్

**మొదటిపేజీ తరువాయి –** ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను ఏప్రిల్ 12న (రేపు) విడుదల చేసేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఒక వినూత్నమైన డిజిటల్ సేవను అందుబాటులోకి తెచ్చింది.ఫలితాల విడుదల సమయంలో వెబ్‌సైట్లు మొరాయించినా లేదా ఇంటర్నెట్ నెమ్మదిగా ఉన్నా, విద్యార్థులు ఎటువంటి ఇబ్బంది లేకుండా తమ వాట్సాప్ ద్వారా నేరుగా మార్కులను తెలుసుకోవచ్చు. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని ఐటీ శాఖ గతేడాది ప్రారంభించిన 'మీసేవ వాట్సాప్ చాట్‌బాట్' ఇప్పుడు ఇంటర్ ఫలితాలను కూడా అందించబోతోంది.

**వాట్సాప్ ద్వారా ఫలితాలు పొందే విధానం:**

ముందుగా మీ మొబైల్‌లో 8096 95 8096 నంబర్‌ను సేవ్ చేసుకోండి.
వాట్సాప్ ఓపెన్ చేసి ఆ నంబర్‌కు 'Hi' అని మెసేజ్ పంపండి.
వచ్చే రిప్లైలో 'మెనూ' పై క్లిక్ చేసి BIE Elam Result ఆప్షన్‌ను ఎంచుకోండి.
అనంతరం 'హజూవఅ ావతీజఱఖవ' బటన్ నొక్కండి.
అక్కడ మీ హాల్ టికెట్ నంబర్, సంవత్సరం వివరాలను ఎంటర్ చేయండి.
సమర్పించిన వెంటనే మీ ఫలితం మరియు మార్కుల వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.




# బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం

**మొదటిపేజీ తరువాయి –** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించక పోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత



వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# కీసర టోల్‌ప్లాజా వద్ద ఘోర ప్రమాదం

### కారుపై బోల్తా పడిన ట్యాంకర్.. న్యాయవాది మృతి



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బ్రేకులు విఫలం కావడంతో ఓ సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి బీఎండబ్ల్యూ కారుపై బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఓ న్యాయవాది అక్కడికక్కడే మృతి చెందారు.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్ వైపు వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ కీసర టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే బ్రేకులు పని చేయలేదు. దీంతో అదుపుతప్పిన ట్యాంకర్, ముందు వెళుతున్న కారు మీదకు దూసుకెళ్లి బోల్తా పడింది. భారీ ట్యాంకర్ కింద కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.ట్యాంకర్‌ను తొలగించేందుకు క్రేన్లు, జేసీబీలను రంగంలోకి దించారు. సుమారు గంటపాటు శ్రమించి ట్యాంకర్‌ను పక్కకు తీసి, కారులో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని వెలికితీశారు. వాహన రిజిస్ట్రేషన్ ఆధారంగా కారు యజమాని హైదరాబాద్‌లోని ఎల్లారెడ్డిగూడకు చెందిన హైకోర్టు న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావుగా పోలీసులు గుర్తించారు.ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అవ్వడమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# స్నేహితుని జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ విరాళం





**గొల్లపల్లి ఏప్రిల్ 11(ప్రజా మంటలు :**గొల్లపల్లి మండలం లోని రాఘవపట్నం, చెందిన స్నేహితుడు మరణించినా తన స్నేహితుల గుండెల్లో, జీవించే ఉంటారని 2017-2018 పదవ తరగతి (రాజ) మిత్రులు నిరూపించారు. మరణం చెందిన తమ ప్రియతమ మిత్రుడు లేట్ గరిగంటి అనిల్ జ్ఞాపకార్థం, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఆ బ్యాచ్ మిత్రులందరూ కలిసి శనివారం వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ కాసరపు భవాని అరవింద్ మాట్లాడుతూ.. స్నేహితుడిపై ఉన్న మమకారాన్ని ఇలా పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమంగా మార్చడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా గరిగంటి అనిల్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఈ విరాళం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.2017-2018 బ్యాచ్ మిత్రులు మాట్లాడుతూ.. తమ స్నేహితుడు అనిల్ జ్ఞాపకార్థం పాఠశాల విద్యార్థులకు ఏదైనా మేలు చేయాలనే ఉద్దేశంతో అందరం కలిసి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. తమ మిత్రుడు భౌతికంగా దూరమైనా, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఎప్పుడూ తమతోనే ఉంటాడని వారు ఆవేదనతో కూడిన గర్వంతో చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, సుమిత్ర ,ఉపాధ్యాయ బృందం, గరిగంటి తిరుపతి కుటుంబ సభ్యులు, కాసారపు భవాని అరవింద్ గౌడ్,ఉప సర్పంచ్ సిరవేణి రవి, మాజీ సర్పంచ్ బుర్ర తిరుపతి, రాజిరెడ్డి,అంజయ్య, మిత్రులు పాల్గొన్నారు.

# "మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

## డి-అడిక్షన్ సెంటర్ సందర్శించిన ఎస్పీ, ఎమ్మెల్యే"



**జగిత్యాల ఏప్రిల్ 11(ప్రజా మంటలు) :**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు, వ్యసనానికి గురైన వ్యక్తులను తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి హెల్త్ మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ , జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ సమస్య ఒక పెద్ద సవాలుగా మారిందని, దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా "ఈగల్ టీం"ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందం ద్వారా డ్రగ్స్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ చర్యలు మరింత బలోపేతం చేయబడుతున్నాయని వివరించారు.ముఖ్యంగా యువత ఈ వ్యసనాలకు గురికాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత దేశానికి అతి పెద్ద సంపద అని, యువత సన్మార్గంలో నడవడం చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో నడుచుకుంటూ తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెండు ప్రత్యేక వార్డులను డి-అడిక్షన్ సెంటర్‌గా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సెంటర్‌లో ఎంత సీరియస్ కేసులైనా సమర్థవంతంగా చికిత్స అందించే నిపుణ వైద్యులు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. చికిత్సతో పాటు అవసరమైన మందులు, సేవలు ప్రభుత్వం తరపున ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.యువత బాగుంటేనే దేశం బాగుంటుందని, అందువల్ల యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మత్తు పదార్థాల నిర్మూలన మరియు వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్పీ మరియు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైద్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు...

# కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**జగిత్యాల ఏప్రిల్ 11 ( ప్రజా మంటలు) :** ప్రజల మధ్యలో ఉంటాం.. మరో మారు అధికారంలోకి వస్తాం.. జీవన్ రెడ్డి పై మంత్రి మరో మారు ఫైర్.. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ పదవి ప్రమాణ స్వీకారం, అభినందన సభ జగిత్యాల జిల్లా కేంద్రంలో ని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ దినేష్ తో ప్రమాణస్వీకారం చేయించారు. జరిగిన కార్యక్రమానికి మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ గెలిచిన, ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ ముందుకు సాగానని అన్నారు. అనేక అవమానాలు ఎదుర్కొంటూ ఎన్నికల్లో ఓటమి చెందిన అధైర్య పడకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను నమ్ముకొని ముందుకు సాగినట్లు మంత్రి తెలిపారు. పార్టీలో కమిట్మెంట్ గా పని చేశాను కనుక నేడు క్యాబినెట్ లో పని చేసే అవకాశం దక్కిందని మంత్రి అడ్లూరి అన్నారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తనకు అనేక ఆఫర్లు ఇచ్చిందని అయినప్పటికీ ఏలాంటి ఆఫర్లను లొంగకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మంత్రి అడ్లూరి అన్నారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని ఎవరు నిరాశ పడవద్దని మంత్రి అన్నారు.రాష్ట్రంలో రేవంత్ పాలన పోవాలి.. మార్పు రావాలి అని జీవన్ రెడ్డి నినాదం ఎత్తుకున్నారని ఎందుకు మార్పు రావాలి అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నందుకు మార్పు రావాలా.. ? అర్హులకు రేషన్ కార్డు లు అందించినందుకు మార్పు రావాలా..? నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు మార్పు రావాలా.. ? మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు మార్పు రావాలా ..? అని జీవన్ రెడ్డిని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని రానున్న రోజుల్లో నిత్యం ప్రజల మధ్య ఉంటూ రాష్ట్రంలో మరో మారు అధికారంలోకి వస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2029లో సైతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. కొత్తగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన దినేష్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను ఆధునీకరిస్తానని ప్రతిజ్ఞ చేశారు జగిత్యాల జిల్లాను రాష్ట్రంలోని ఆదర్శవంతమైన జ్ఞాన జిల్లాగా తీర్చిదిద్దడమే తన ఆశయమని పేర్కొన్నారు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అక్కడ అత్యాధునిక డిజిటల్ వసతులు ఏసి రీడింగ్ రూములు వైఫై సదుపాయం కల్పించాలని ఈ సందర్భంగా మంత్రిని కోరారు పేద విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించేలా ప్రణాళికలు రూపొందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి,పిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుతో పాటు జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగ భూషణం తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, బండ శంకర్ జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఈ నెల 20న కేసీఆర్ బహిరంగ సభ





**జగిత్యాల, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సమక్షంలో ఈ నెల 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.సభ ఏర్పాట్ల కోసం మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ రమణ, లోక్ బాపు రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ తదితరులు జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం, ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కాలేజ్, మోతే రోడ్ ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు మాట్లాడుతూ, మోతే రోడ్‌లో నిర్వహించే ఈ బహిరంగ సభకు సుమారు లక్ష మందికి పైగా ప్రజలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కేసీఆర్‌ను వినేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ, తన శేష జీవితంలో కేసీఆర్‌తో కలిసి పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో మార్పు రావాలంటే కేసీఆర్ రావాలని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లోనే విఫలమైందని విమర్శించారు.

# రాష్ట్రపాలన అస్తవ్యస్తం : కొప్పుల



**జగిత్యాల, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**ఈ నెల 20న నిర్వహించనున్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బహిరంగ సభకు సంబంధించి జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోతె రోడ్డు పక్కనున్న స్థలాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి తదితర నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, రెండేళ్లలోనే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జగిత్యాల సభతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు.అలాగే జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూరిందని పేర్కొన్నారు. ఈ సభను లక్ష మందితో భారీ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**సికింద్రాబాద్, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**భోలక్ పూర్ డివిజన్ పరిధిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ విద్యా దశను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు.ముఖ్యంగా యూకేజీ పూర్తి చేసుకుని ఒకటో తరగతిలోకి, అలాగే ఐదో తరగతి ముగించుకుని ఆరో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక గ్రాడ్యుయేషన్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రాడ్యుయేషన్ దుస్తులు ధరించి పట్టభద్రుల తరహాలో సందడి చేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులను అందజేసి వారిని ప్రోత్సహించింది.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం డాక్టర్ మంచాల వరలక్ష్మి, కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు తో పాటు ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

# గాంధీ మెడికల్ కళాశాలలో టీజీఏఎఫ్ఎంకాన్-2026 సదస్సు



**సికింద్రాబాద్, ఏప్రిల్ 11 ( ప్రజా మంటలు):** గాంధీ మెడికల్ కళాశాల వేదికగా ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండో వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సు 'టీజీఏఎఫ్ఎంకాన్ 2026' శనివారం అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైద్య రంగంలో ఫోరెన్సిక్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని, కేసుల ఛేదనలో అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తూ, సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిర, సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, హెల్త్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫోరెన్సిక్ వైద్య నిపుణులు, యువ డాక్టర్లు హాజరైన ఈ సదస్సులో ఫోరెన్సిక్ మెడిసిన్ , టాక్సికాలజీలో వస్తున్న మార్పులు, ఆధునిక పోకడలపై శాస్త్రీయ చర్చలు మరియు నిపుణుల ప్రసంగాలు కొనసాగాయి. ముఖ్యంగా నేర పరిశోధనలో ఫోరెన్సిక్ నిపుణుల ప్రాధాన్యతపై ప్రముఖులు పలు కీలక విషయాలను వెల్లడించారు.

# మహాత్మా జ్యోతి రావు పూలే కు నివాళులు



**మెటుపల్లి, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**అంటరానితనంపై పోరాటం చేసి, సామాజిక అసమానతలను నిర్మూలించేందుకు జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మెటుపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.స్త్రీ విద్యకు పునాది వేసిన మార్గదర్శి, అణగారిన వర్గాల ఆశాజ్యోతి అయిన పూలే గారి సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సమాజంలో ఉన్న అంతరాలను తొలగించి సమానత్వాన్ని స్థాపించడంలో ఆయన చేసిన కృషి అపూర్వమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ-రాజేందర్ పాల్గొని పూలే గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# జ్యోతిభాయి పూలే సేవలు చిరస్మరణీయం

## - బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్ రెడ్డి



**మెటుపల్లి, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**సామాజిక సంస్కరణల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని మెటుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం పూలే 199వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, పూలే తీసుకొచ్చిన సంఘ సంస్కరణలు ఈనాటికీ ఆదర్శప్రాయంగా నిలిచాయని అన్నారు. సమాజంలో సమానత్వం, విద్య విస్తరణ కోసం ఆయన చేసిన కృషి అపూర్వమని కొనియాడారు.ప్రస్తుత యువతరం పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు మగ్గిడి వెంకట నర్సయ్య, జిల్లా వెంకటేశ్వర్లు, ఎలముల రాంబాబు, ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, రాంపల్లి జగన్, కాజీపేట స్రవంతి, ఆకుల మానస, రాజశేఖర్, రమణ, అశోక్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళల ఉపకోటా కోసం జాగృతి ఉద్యమం ఉధృతం

## కవిత హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ ఉపకోటా లేకపోవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు భయం లేకపోవడం వల్లే కేంద్ర ప్రభుత్వం ఉపకోటా ఇవ్వలేదని విమర్శించారు.బీసీ మహిళలకు ఉపకోటా సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని, అవసరమైతే ఢిల్లీ స్థాయిలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం చేసినట్టే బీసీ ఉపకోటా కోసం కూడా జాగృతి కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. పూలే విగ్రహం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ జయంతి నాటికి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఇక విద్యుత్ శాఖ ఆర్టిజన్ల సమస్యలపై కూడా స్పందిస్తూ, వారిని రెగ్యులర్ చేయాలని, కొత్తగూడెం ధర్నాకు జాగృతి మద్దతు ఉంటుందని తెలిపారు

# పూలే విగ్రహంపై నిర్లక్ష్యం జాగృతి ధర్నా, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటులో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపిస్తూ తెలంగాణ జాగృతి నాయకులు ఐమ్యాక్స్ ఎదురుగా లేక్ వ్యూ పార్క్‌లో ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి నేతృత్వం వహించారు.జాగృతి నేతలు మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చినా, అమలులో మాత్రం విఫలమవుతోందని విమర్శించారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించిన తర్వాత ఐమ్యాక్స్ చౌరస్తాలో పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే పూలే జయంతి నాటికి కూడా విగ్రహాలు పూర్తి చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.ఇటీవల ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తొందరపాటుగా తీసుకురావడం పట్ల బీసీ సంఘాలు, జాగృతి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకుందని పేర్కొన్నారు.బీసీలను రాజకీయ అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తూ అవమానిస్తున్నారని ఆరోపించిన జాగృతి నేతలు, గత ప్రభుత్వంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ విషయంలోనూ ఇలాంటి పరిస్థితి నెలకొన్నదని గుర్తు చేశారు.అలాగే తెలంగాణ ఏర్పడి 13 ఏళ్లు అవుతున్నప్పటికీ ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయకపోవడం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని తప్పుపట్టారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా బీసీలకు చేసిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాయని ఆరోపిస్తూ, బీసీలంతా ఐక్యంగా పోరాడాలని జాగృతి పిలుపునిచ్చింది.

# దేశంలోనే ప్రథమ స్థానం సాధించిన కోనేరుపల్లె గ్రామం



**చొప్పదండి, ఏప్రిల్ 10 (ప్రజా మంటలు):**చొప్పదండి మండలంలోని కోనేరుపల్లె గ్రామం జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు "క్రీడా మిత్ర పంచాయతీ" ప్రణాళికలో భాగంగా యువతను క్రీడల వైపు మళ్లించే దిశగా చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించింది.క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన "సర్పంచ్ సంవాద్" యాప్ ద్వారా నిర్వహించిన పోటీల్లో గ్రామం తరపున రూపొందించిన వీడియోకు దేశవ్యాప్తంగా మొదటి స్థానం లభించగా, రూ.35 వేల నగదు బహుమతి అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉపసర్పంచ్ గజ్జెల తిరుపతి, పాలకవర్గ సభ్యులు, అధికారులు కూడా అభినందనలు అందుకున్నారు.కోనేరుపల్లె గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చినందుకు ఎమ్మెల్యేకు గ్రామ పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా పూలే జయంతి వేడుకలు



**కరీంనగర్, ఏప్రిల్ 11 (ప్రజా మంటలు):**మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.డీసీసీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ముఖ్య అతిథిగా హాజరై, నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఉన్న పూలే విగ్రహానికి కూడా పూలమాలలు సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, "అజ్ఞానంపై అక్షరంతో యుద్ధం చేసిన మహాత్ముడు పూలే" అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.అలాగే పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం కాంగ్రెస్ పార్టీ బాధ్యత అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లతో సామాజిక న్యాయం దిశగా కృషి చేస్తోందని అన్నారు.కార్యక్రమంలో పలు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 'సర్' సర్వే వాయిదా - మళ్లీ ఎప్పుడంటే?

**ఐదు రాష్ట్రాల ఎన్నికలు, రాష్ట్రంలో జనగణన ఏర్పాట్లతో ఈ నిర్ణయం**

**4.5 లక్షల మందికి రెండేసి చోట్ల ఓట్లు**

**కేంద్ర ఎన్నికల సంఘం 25 ఏళ్లకోసారి ఓటరు జాబితా సమగ్ర సవరణ**



రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో నిర్వహించాలని నిర్ణయించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే జూన్‌కు వాయిదా పడింది. ఏప్రిల్, మే నెలల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికలు అలాగే రాష్ట్రంలో జనగణనలో భాగంగా సిబ్బందికి శిక్షణ వంటి కార్యక్రమాలు ఉండటంతో ఎన్నికల సంఘం వాయిదా వేయడానికి నిర్ణయం తీసుకుంది. ఈ సర్ సర్వే కేంద్ర ఎన్నికల సంఘం 25 ఏళ్లకోసారి ఓటరు జాబితా సమగ్ర సవరణ చేస్తోంది. ఈ సవరణ చివరగా 2002లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగింది.

**మూడు దశల్లో 'సర్' సర్వే నిర్వహణ :** అప్పటి సమగ్ర జాబితా ఆధారంగా 2025 నాటి ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా మూడు దశల్లో సర్ సర్వే నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. మొదటి దశ బిహార్‌లో పూర్తయింది. రెండో దశలో మొత్తం 11 రాష్ట్రాల్లో చేపట్టగా అక్కడ మ్యాపింగ్ పూర్తయి సర్ కూడా పూర్తి కావచ్చింది. ఇక చివరి దశకు వస్తే తెలంగాణతో పాటు మిగతా రాష్ట్రాల్లో చేసేందుకు మ్యాపింగ్ ప్రక్రియ మొదలైంది. ఇప్పటివరకు దాదాపు 80 శాతానికిపైగా పూర్తయింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే వంద శాతం జరిగింది.

**'సర్' సర్వే వాయిదాకు కారణం అదేనా? :** మ్యాపింగ్ చేసి పెట్టుకున్న ఓటర్ల వివరాలను సర్ సర్వేలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి పరిశీలన చేస్తారు. ఏప్రిల్ నెలలోనే సర్వే ప్రారంభించాలని మొదట కేంద్రం ఎన్నికల సంఘం భావించి కార్యాచరణ సిద్ధం చేసింది. అయితే రాష్ట్రంలో జనగణన కుటుంబాల లెక్కింపు ప్రక్రియ వచ్చే నెలలో జరగాల్సి ఉంది. కానీ ఏప్రిల్, మే నెలల్లో 5 రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో సర్ సర్వే వాయిదా పడింది. తిరిగి మళ్లీ జూన్‌లో ప్రారంభం కానుంది. ఇప్పుడు రాష్ట్రంలో రెండు చోట్ల నమోదైన ఓటర్లు 4.5 లక్షల మంది ఉన్నట్లు కేంద్రం ఎన్నికల సంఘం అధికారుల సర్ సర్వే పూర్తయితే చనిపోయినవారి పేర్లతో పాటు ఇతర ప్రాంతాలకు కూడా వెళ్లి, అక్కడ ఓటర్లుగా నమోదైన వారి పేర్లను తొలగిస్తారు.

**ప్రామాణిక పత్రాలు ఏంటంటే :**

ఈ సర్వే ఓటర్లకు సంబంధించి 11 రకాల గుర్తింపు కార్డులను స్వీకరిస్తుంది.

1987 ముందు జన్మించిన వారికి తల్లిదండ్రుల వివరాలు 1987 -2004 వరకు పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రాలు.

2004 తర్వాత అదనపు పత్రాల్లో పాస్‌పోర్ట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గుర్తింపు కార్డులను తీసుకోనుంది.

1987 ముందే అయితే దేశంలో ప్రభుత్వ, స్థానిక సంస్థలు, బ్యాంకులు, ఎల్‌ఐసీ జారీ చేసిన ఆధారాలు

జనన ధ్రువీకరణ పత్రంకుల ధ్రువీకరణ పత్రంవిశ్వవిద్యాలయం జారీ చేసిన విద్యా ధ్రువీకరణ పత్రంఅధికారిక స్థిర నివాసస ధ్రువీకరణ పత్రం

జాతీయ గుర్తింపు కార్డు

అటవీ హక్కుల పత్రం

స్థానిక అధికారుల కుటుంబ గుర్తింపు

ప్రభుత్వం జారీ చేసిన భూమి లేదా ఇంటి కేటాయింపు పత్రం

ఇందులో ఏవైనా పత్రాలు సమర్పించాలి.

2002 ఎందుకంటే? : ఆఖరి సారిగా 2002లో సర్ సర్వే జరిగింది. నాటి ఓటరు జాబితాను ప్రక్షాళన చేస్తున్నారు. అక్రమంగా ఓటు హక్కు పొందిన శరణార్థులు, విదేశీయులు, ఒకే వ్యక్తి స్వగ్రామంతో రాజధానిలోనూ ఓటు హక్కు కలిగి ఉండటం వంటి పరిస్థితులకు 'సర్' తో తెరపడుతుంది.

**ఎవరు ఓటర్ కార్డు చూపాలంటే? :**

ఏ - 1987 ముందు పుట్టిన వారు 2002లో ఓటరు జాబితాలో ఓటు కలిగి ఉన్న వారు. సర్వే రోజున గుర్తింపు కార్డు చూపాల్సిన అవసరం లేదు.

బీ - 1987కు ముందు జన్మించి 2002 జాబితాలో ఓటరుగా నమోదు కాని వారు. గుర్తింపు కార్డును సమర్పించాల్సి ఉంటుంది.

సీ - 1987 నుంచి 2004 మధ్యలో జన్మించిన వారు తమ తల్లిదండ్రుల 2002 నాటి ఓటరు గుర్తింపు కార్డును ఇవ్వాలి.

డీ - 2004 తర్వాత పుట్టిన వారు తల్లిదండ్రుల ఓటరు వివరాలతో సర్వే పూర్తి చేయించుకోవాల్సి ఉంటుంది.

# తప్పించుకునేందుకు యత్నం

**ప్రేమోన్మాదిపై పోలీసుల కాల్పులు**

**ప్రేమోన్మాది వెంకటేశ్‌పై కాల్పులు జరిపిన పోలీసులు**

**ఖాజీపేటలో యువతిని గొంతు కోసి చంపిన వెంకటేశ్**

**పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించగా**

**నిందితుడి కాళ్లపై కాల్చిన పోలీసులు**



వైఎస్సార్ కడప జిల్లాలో నిన్న ఖాజీపేటలో కీర్తన గొంతుకోసిన ప్రేమోన్మాది వెంకటేశ్‌పై పోలీసులు కాల్పులు జరిపారు. శనివారం తెల్లవారుజామున పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించగా వెంకటేశ్‌పై కాల్పులు జరిపారు. మైదుకూరు నుంచి నిందితుడిని తీసుకెళ్తుండగా తప్పించుకునేందుకు వెంకటేశ్ యత్నించాడు.

**తప్పించుకునే యత్నంలో పోలీసుల కాల్పులు:** ఈ క్రమంలో ఇద్దరూ కానిస్టేబుళ్లను గాయపరిచి పరారవుతున్న వెంకటేశ్‌పై పోలీసుల కాల్పులు జరిపారు. దాంతో ముందుగా గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు పోలీసులు జరిపారు. ఈ నేపథ్యంలో పోలీసులపై దాడి చేయడంతో నిందితుడు కాళ్లకు పోలీసులు కాల్చారు. అనంతరం తీవ్రంగా గాయపడిన నిందితుడు వెంకటేశ్ ను కడప రిమ్స్ కు తరలించి పోలీసులు చికిత్స చేయిస్తున్నారు. అయితే నిన్న పెద్ద ఎత్తున జాతీయ రహదారిని దిగ్బంధించి నిందితున్ని తమకు అప్పగించాలని మృతురాలు కీర్తన బంధువులు ఆందోళనలను వ్యక్తం చేశారు.

**అసలేం జరిగిందంటే?:** కడప జిల్లా ఖాజీపేట అగ్రహారం కాలనీకి చెందిన శ్రీనివాసులు, నాగమనెమ్మ దంపతుల కుమార్తె కీర్తన ప్రేమోన్మాది చేసిన దాడికి బలైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అమ్మాయి ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. ఖాజీపేట మండలం ఆంజనేయ కొట్టాల గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో గత కొంతకాలంగా అమ్మాయి వెంట పడేవాడు. అమ్మాయి వరస కాకపోయినా ప్రేమించాలని వేధించేవాడు. గతంలో పలుమార్లు తల్లిందండ్రులు, సోదరులు వెంకటేశ్ ను హెచ్చరించారు. అయినా వినకుండా పలుమార్లు ఫోన్లు చేసి, వెంటపడి వేధించేవాడని కుటుంబ సభ్యులు అంటున్నారు.

**పెళ్లికి నిరాకరించినందుకే :** శుక్రవారం నాడు తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయం చూసి కీర్తన ఒంటరిగా ఇంట్లో ఉందని గ్రహించిన ప్రేమోన్మాది వెంకటేశ్ మరో స్నేహితుడు ఫణిని వెంటబెట్టుకుని అమ్మాయి ఇంటికి వెళ్లాడు. తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకుందామని కీర్తనతో వాదించాడు. తాను ప్రేమించేది లేదు, పెళ్లి చేసుకునేది లేదు, ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోవాలని అమ్మాయి గట్టిగానే బదులిచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన దుర్మార్గుడు వెంకటేశ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో కీర్తన గొంతుకోసి పరారయ్యాడు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అమ్మాయిని స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న తండ్రి శ్రీనివాసులు హుటాహుటిన కుమార్తెను భుజం మీద ఎత్తుకుని ఆసుపత్రికి బయలుదేరాడు. కానీ అప్పటికే సమయం మించిపోవడంతో కడప రిమ్స్ కు వెళ్తుండగా మార్గమధ్య లోనే కుమార్తె మృతి చెందిందని తండ్రి శ్రీనివాసులు గుండెలవిసేలా రోదించారు.

**రెండు గంటల పాటు ఆందోళన:** కీర్తన అనే అమ్మాయిని వెంకటేశ్ అనే వ్యక్తి గొంతు కోశాడనే విషయం దావానంలా వ్యాపించడంతో బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున శుక్రవారం ఖాజీపేట వద్ద ప్రధాన జాతీయ రహదారిలో రాస్తారోకో చేశారు. దాదాపు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. కర్నూలు-కడప జాతీయ రహదారిని దిగ్బంధించారు. టైర్లకు నిప్పుపెట్టి నిరసన తెలిపారు. ఫలితంగా పలు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నిందితున్ని తమకు అప్పగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అనంతరం విషయం తెలిసిన వెంటనే పోలీసులు నిందితుడు వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఖాజీపేట నుంచి మైదుకూరు డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. అతన్ని లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో మైదుకూరు నుంచి వేరే ప్రాంతానికి తరలిస్తున్న సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లను గాయపరిచి పారిపోవడానికి నిందితుడు వెంకటేశ్ యత్నించడం గమనార్హం.

# ఉగ్రవాద భావజాలాన్ని పెంపొందించటమే విజయవాడ యువకుల లక్ష్యం

**కస్టడీలో బయటపడిన నిజాలు**

**విజయవాడ ఉగ్రలింకుల కేసులో వేగంగా దర్యాప్తు**

**కస్టడీ ముగిసిన నిందితులు చెప్పిన వివరాల ఆధారంగా ప్రశ్నలు**

**విజయవాడ చేరుకున్న ఎన్ఐఏ, ఐబీ అధికారులు**



విజయవాడ ఉగ్రలింకుల కేసు ఇటీవలే కేంద్ర దర్యాప్తు సంస్థలు, ముఖ్యంగా నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, ఇంటెలిజెన్స్ బ్యూరో రంగంలోకి భద్రతాపరంగా కీలకంగా దిగడంతో దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసు పరిధిలో విజయవాడ నగరంలో అనేక ఉగ్రవాద సంబంధిత కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా ముగ్గురు యువకులు విజయవాడలోని మిగతా నిందితులను ఉగ్రవాద భావజాలానికి ప్రేరేపించి జిహాదీ కార్యకలాపాల కోసం సిద్ధం చేస్తున్నట్లు పోలీసు, కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి.

**సామాజిక మాధ్యమాల ద్వారా జిహాదీల భావజాలం పెంపు :** కస్టడీలో ఉన్న నిందితుల విచారణలో ఆరుగురు ముఖ్య నిందితులను విజయవాడ పోలీసులు కౌంటర్ ఇంటెలిజెన్స్ సిబ్బందితో కలిసి ప్రశ్నించారు. వీరిలో దిల్లీ నుంచి వచ్చిన లక్ష్మీ అహ్మద్, జోధ్పూర్‌కు చెందిన జిషాన్ అబ్దుల్ మజీద్ వంటి వ్యక్తులను విచారించారు. నిందితులు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల ద్వారా జిహాదీ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా అధికారులు తమ ఇంటరాగేషన్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వేర్వేరుగా నిందితులను విచారించి, వారి ఉగ్రవాద సంబంధాలను, విదేశీ హ్యాండ్లర్ల సమాచారం సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు.

**సోమవారంతో ముగియనున్న రిమాండ్ :** ఈ కేసు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యగా మారినందున, దర్యాప్తు పూర్తి స్థాయిలో చీఞూ చేతికి బదిలీ చేశారు. విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఇప్పటికే ఈ కేసు బదిలీ లేఖకు సంతకం చేశారు. ఈ నేపథ్యంలో కేసు బదిలీ ప్రక్రియ త్వరలోనే పూర్తి కావచ్చునని భావిస్తున్నారు. ప్రస్తుతం కస్టడీలో ఉన్న ఐదుగురు నిందితుల రిమాండ్ సోమవారంతో ముగుస్తుండగా, కేసు దర్యాప్తు మరింత తీవ్రతరం అవ్వడం ఖాయం అంటూ అధికారులు భావిస్తున్నారు.

**యువతను ప్రేరేపించడమే ప్రధానం :** కేసులో అరెస్ట్ అయిన మైనర్ రిమాండ్‌ను ఈ నెల 24 వరకు పొడిగించారు. అతడి కస్టడీ కోసం పోలీసులు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జూన్ 13కి వాయిదా పడింది. మైనర్‌కు సంబంధించిన విచారణ కూడా ఉగ్రవాద కార్యకలాపాల చివరి విడత నిందితుల విచారణలో కీలకమవుతుంది. ఈ కేసులో విజయవాడలోని ఉగ్రవాద భావజాలాన్ని పెంపొందించి, జిహాద్ సిద్ధత కోసం యువతను ప్రేరేపించడంలో ప్రధాన పాత్ర పోషించిన వారు ఎవరో, వారి సంబంధాలు, విదేశీ హ్యాండ్లర్లు ఎవరన్న విషయాలు దర్యాప్తులో వెలుగుచూస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ, దిల్లీ, జోధ్పూర్ వంటి ప్రాంతాల మధ్య ఉగ్రవాద సంబంధాలు భద్రతా ముప్పులు సన్నిహితంగా పరిశీలనలో ఉన్నాయి.

**మరిన్ని విషయాలు వెలుగులోకి :** ఈ కేసు కేంద్రం, రాష్ట్రం కలసి నిర్వహిస్తున్న సమగ్ర దర్యాప్తు చర్యల్లో కీలకంగా మారింది. ఉగ్రవాద చర్యలను నిరోధించేందుకు, యువతలో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడాన్ని అరికట్టేందుకు ఈ దర్యాప్తు కీలకమని భావిస్తున్నారు. తదుపరి విచారణలు, విచారణ ఫలితాలు వెలుగు చూసే సమయంలో ఈ కేసు మరింత వివరాలు వెల్లడిస్తుందని అంచనాలు బలపడుతున్నాయి.

# మైక్రో ఫైనాన్స్ పేరుతో రూ.10 కోట్ల మోసం

**సింగర్ మంగ్లీపై కేసు నమోదు**

**గాయకురాలు మంగ్లీతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు**

**తనకు ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్న న్యాయవాది సుబ్బారావు**

**బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేసిన పోలీసులు**



సినీ గాయకురాలు మంగ్లీతో పాటు మరో నలుగురిపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధిక లాభాల మైక్రో ఫైనాన్స్ పేరుతో రూ.10 కోట్లు మోసం చేసినట్లు ఓ న్యాయవాది ఫిర్యాదు చేశారు. మంగ్లీతో పాటు ఆమె సోదరుడు, మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో తనకు ప్రాణహాని ఉందని న్యాయవాది సుబ్బారావు పేర్కొన్నారు. దీంతో మొత్తం ఐదుగురిని బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పెట్టుబడుల పేరిట రూ.10 కోట్ల మోసం :** మైక్రో ఫైనాన్స్ పథకాలలో పెట్టుబడులు పెట్టిస్తామని నమ్మించి రమావత్ మధుపాల్ అలియాస్ భరత్ చౌహాన్, శైలజా చౌహాన్, శివ (మంగ్లీ సోదరుడు), మంగ్లీ కలిసి సుమారు రూ.9.5 నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నిధులను "గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్" పేరిట ఇంపోర్ట్-ఎక్స్‌పోర్ట్, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వ్యాపారాల్లో పెట్టుబడి పెడతామని బాధితులను నమ్మించారు. ఈ నేపథ్యంలోనే హేమకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తిరుమల్ తదితరులు భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టి మోసపోయినట్లు తెలుస్తోంది.

**మంగ్లీ డబ్బు ఆఫర్ చేసినట్లు ఆరోపణలు :** ఈ మేరకు బాధితులు తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన న్యాయవాది సింగపోగు సుబ్బారావును సంప్రదించారు. దీనిపై సింగర్ మంగ్లీని సంప్రదించగా, ఆమె అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. అంతేకాదు ఈ కేసులో ఆమెను, తన సోదరుడు శివను చేర్చవద్దని మంగ్లీ ఆ న్యాయవాదికి డబ్బు ఆఫర్ చేసినట్లు ఆరోపించారు. ఆ తర్వాత దర్శకుడు వేణు ఊడుగుల, అడ్వకేట్ పూజారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంజాగుట్టలో సమావేశం ఏర్పాటు చేశారు.

**న్యాయవ్యాది సుబ్బారావుకు ప్రాణహాని :** మంగ్లీ, వేణు, పూజారి నాగేశ్వర రావు, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి తదితరులు కేసు వేయవద్దని, అలాగే మీడియా వీడియోలు తొలగించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమావేశం ముగిసే సమయంలో వేణు ఊడుగుల బెదిరించగా, మంగ్లీ అసభ్య పదజాలంతో దూషించి హత్య చేస్తామని బెదిరించినట్లు సుబ్బారావు ఆరోపించారు. అదే విధంగా రమావత్ మధు, శివ ఫోన్ చేసి బెదిరించినట్లు తెలిపారు. దీంతో తనకు ప్రాణహాని ఉందని సుబ్బారావు పోలీసులను ఆశ్రయించగా, బీఎన్ఎస్ సెక్షన్ 351(2), 352 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# హైదరాబాద్ జనాభాకు 79 లక్షల చెట్లు అవసరం

**మరి నగరంలో ఎన్ని ఉన్నాయంటే?చెట్ల గణనకు సిద్ధమవుతోన్న దిల్లీ ప్రభుత్వం**

**నగరంలోనూ చెట్ల సర్వే అవసరమంటున్న పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు**

**సర్వేతో చేకూరనున్న ప్రయోజనాలివే హైదరాబాద్‌లో చెట్ల సంఖ్య ఎంత**



మానవుడి జీవనానికి ప్రాణవాయువు అతి ముఖ్యమైనది. దానిని అందించేది ప్రకృతి సహజ సిద్ధమైన చెట్లు. పల్లెల్లో అయితే పంట పొలాలతో పాటు పచ్చదనం కూడా మెండుగానే ఉంటుంది. మరి పట్టణాల్లో ఉండాల్సిన స్థాయిలో ఉన్నాయా అంటే సందేహించాల్సి వస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎంతోమంది నివసిస్తుంటారు. వారికి కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి దొరుకుతుందా అనే విషయంపై ఐఐఎస్‌సీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్) పరిశోధనలు చేసింది. మరి ఆ అధ్యయనాలు ఏం చెప్తున్నాయి. హైదరాబాద్ జనాభాకు ఎన్ని చెట్లు కావాలి? రాజధానిలో ఎన్ని చెట్లు ఉన్నాయి? ఎన్ని తొలగించారు పూర్తి లెక్కలు ఇప్పుడు చూద్దాం.

**నగరానికి మొత్తం 79 లక్షల చెట్లు అవసరం :** ఐఐఎస్‌సీ ప్రకారం చూస్తే ఒక వ్యక్తి రోజుకు 540 నుంచి 980 గ్రాముల కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తాడు. ఆ కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చటానికి 7-8 చెట్లు అవసరం పడుతుంది. ఈ విధంగా చూసుకుంటే ఒక హెక్టారు విస్తీర్ణంలోని చెట్లు ఏటా 6 నుంచి 8 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహిస్తాయి. ఈ గణాంకాల పరంగా చూసుకుంటే హైదరాబాద్ నగరానికి 79 లక్షల చెట్లు ఉండాలని తేలింది. అయితే రాజధానిలో మొత్తం ఎన్ని చెట్లు ఉన్నాయి? ఎన్ని తీసేస్తున్నారన్న విషయం మాత్రం స్పష్టంగా తెలియదు.

**దిల్లీలో చెట్ల గణాంకాలు :** దిల్లీ నగరంలోనే ఎక్కువగా కాలుష్యం విడుదలవుతుందని తెలుస్తోంది. అక్కడి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అక్కడి ప్రభుత్వం తాజాగా సమగ్ర చెట్ల గణనకు సిద్ధమవుతోంది. ఈ ప్రక్రియ కోసం కేంద్రం రూ.2.9 కోట్లను మంజూరు చేసింది. దీనికి డెహ్రాడూన్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్ఆర్ఐ) నేతృత్వం వహిస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోనూ సర్వే నిర్వహించాలంటూ పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు."అభివృద్ధిలో భాగంగా అనేక చెట్లను తొలగించిన నేపథ్యంలో దిల్లీలో ట్రీ సెన్సస్‌కు కోర్టు ఆదేశాలిచ్చింది. అందుకే చెట్ల గణన చేపట్టారు. పుణెలో కూడా ఈ సర్వే చేశారు. నగరంలో కూడా తప్పనిసరిగా చేయాల్సిన అవసరం ఉంది.

**గతంలో చేపట్టిన సర్వేలు :** రాజధానిలో గతంలో కొన్ని సంస్థలు ఈ చెట్ల గణనను చేపట్టే ప్రయత్నం చేసినప్పటికీ, దీనిపై పూర్తి వివరాలు నమోదు చేయలేదు. 2024లో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ (వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్) - ఇండియా హైదరాబాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్ యాన్యువల్ ట్రీ బయో డైవర్సిటీ సర్వేను చేపట్టారు. ఈ సర్వేలో చెట్ల జాతులపై ఎక్కువగా దృష్టి సారించారు. మొత్తంగా 753 చెట్ల (120 జాతుల)పై సర్వే చేశారు. ఇవి 6,065 జీవాలకు (పక్షులు, చీమలు, ఇతరాలకు) ఆవాసంగా ఉన్నాయని గుర్తించారు. 2022లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మరొక సర్వే చేశారు. సిటీ బయోడైవర్సిటీ ఇండెక్స్ కింద కొంత గ్రీన్‌కవర్ అవసరమని వారు అంచనా వేశారు. అయితే వీటి సర్వే పూర్తిస్థాయిలో నిర్వహించలేదని పర్యావరణవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఈ సారి పూర్తిస్థాయిలో చెట్ల సర్వేను చేపట్టాలని అంటున్నారు.

"నగరంలో వేగంగా పచ్చదనం పెరగాలని విపరీతంగా కోనోకార్పస్ చెట్లు పెంచారు. ఇవి పర్యావరణానికి, మనుషుల ఆరోగ్యానికి సమస్యలు కలిగిస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో వీటిని నిషేధించారు. ఇలాంటి వాటిని తొలగించి ప్రయోజనాలు చేకూర్చే చెట్లను పెంచాలి" - ఉదయ్‌క్రిష్ణ, వట ఫౌండేషన్

**చెట్ల సర్వేతో ఉన్న ప్రయోజనాలివే :** ప్రస్తుతం నగరంలో కొన్నిచోట్ల ఎక్కువ చెట్లు ఉంటే, మరికొన్ని చోట్ల చాలా తక్కువ చెట్లు కనిపిస్తున్నాయి.ఈ సర్వే వల్ల వేడి (హీట్ ఐలాండ్స్) ప్రాంతాలను గుర్తించి అక్కడ చెట్లను పెంచాలి. అలా చేయటంతో ధూళి, పొగ, పీఎం 2.5 వంటి కాలుష్యాన్ని వడపోసి స్వచ్ఛమైన గాలిని అందిస్తాయి. రోడ్లు, భవనాలతో పాటు ఇతర అభివృద్ధి పనుల్లో ఏ చెట్లు తొలగించాలి? ఏ చెట్లను రక్షించాలనే నిర్ణయం సులభమవుతుంది. చెట్ల ఆరోగ్య స్థితి తెలుసుకోవడానికి ట్రీ సెన్సస్ చాలా అవసరం. దీంతో వ్యాధులు, కీటకాలు, వయసు కారణంగా దెబ్బతిన్న చెట్లను గుర్తించి రక్షించొచ్చు.

గ్రేటర్‌లో ఏ ప్రాంతంలో చెట్లు నాటాలి? ఏ చెట్లు ఎక్కువ ప్రయోజనం వంటి వివరాలు దీని ఆధారంగా నిర్ణయించొచ్చు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com